# కార్యకర్తలే పార్టీల విజయానికి పునాదులు

- ప్రజలంతా మరోసారి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కంకణం కట్టుకున్నారు
- శివ్వంపేట మండలం నుంచి సునీతాలక్ష్మారెడ్డికి భారీ మెజార్టీ ఇస్తాం
- ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా పిలుపు


శివ్వంపేట: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ మహేశ్ గుప్తా

శివ్వంపేట, నవంబర్3: కార్యకర్తలే పార్టీల విజయానికి పునాదులని, ప్రజలంతా మరోసారి కేసీఆర్‌ను గెలిపించాలని కంకణం కట్టుకున్నారని జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన శివ్వంపేటలో విలేకరులతో మాట్లాడుతూ శివ్వంపేట మండలంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అందరం ఏకతాటిపైకి వచ్చి బీఆర్‌ఎస్ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించడం జరుగుతున్నదని, శివ్వంపేట మండలం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డికి భారీ మెజార్టీ ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. మండలంలో వర్గభేదాలు లేకుండా అందరం పార్టీ విజయం కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. బూత్ స్థాయి నాయకులు ప్రతి ఓటరును కలిసి బీఆర్‌ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలో వివరించాలని, ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. రాష్ట్ర ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, ప్రచారానికి ఎక్కడికి వెళ్లిన ప్రజలు తమకు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. తొమ్మిదిన్నర ఏండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మరింత మెజార్టీ అందించాలనే ధృఢ సంకల్పంతో మండల వ్యాప్తంగా విస్తృత ప్రచారాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి కార్యకర్తను బీఆర్‌ఎస్ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని, కన్నతల్లి లాంటి పార్టీని మరువకూడదన్నారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ వెంకటేశ్, వార్డుసభ్యులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం

నర్సాపూర్, నవంబర్ 3: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ఈ ప్రచారంలో పాల్గొంటారని, మండలంలోని తుజాల్‌పూర్, తిరుమలపూర్, బ్రాహ్మణపల్లి, గొల్లపల్లి, లింగాపూర్, అచ్చంపేట్, నారాయణపూర్ గ్రామాల్లో ప్రచారం ఉంటుందని ఆయన వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రచారం తుజాల్‌పూర్ గ్రామం నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


నర్సాపూర్ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

## ప్రభుత్వ కళాశాలలో 'మాక్ పోలింగ్'

నర్సాపూర్, నవంబర్3: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 'స్వీప్' ఆధ్వర్యంలో ఈఎల్‌సీ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులతో 'మాక్ పోలింగ్' నిర్వహించామని ప్రిన్సిపాల్ రవీందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించామని, ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కళింగరెడ్డి, నాగరాజు, జ్యోత్స్నరెడ్డి, మాధవి, రమాదేవి, రాజేశ్వర్, జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి చిత్రపటాన్ని కాల్చివేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## నర్సాపూర్ టికెట్ అమ్ముకున్నారని వంశీచంద్‌రెడ్డి చిత్రపటం దహనం

నర్సాపూర్, నవంబర్ 3: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డి చిత్రపటాన్ని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అసంతృప్తి నాయకులు శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు పెట్రోల్ పోసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతిసురేశ్‌నాయక్ మాట్లాడుతూ నర్సాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్‌ను కాంగ్రెస్ నేత వంశీచంద్‌రెడ్డి రూ.20 కోట్లకు అమ్ముకున్నాడని ఆరోపించారు. వంశీచంద్‌రెడ్డికి నర్సాపూర్‌తో సంబంధం ఏంటని ప్రశ్నించారు. నర్సాపూర్ టికెట్ రాజిరెడ్డికి ఇప్పిచేందుకు వంశీచంద్‌రెడ్డి రూ.20 కోట్లు నగదుతో పాటు రంగారెడ్డి జిల్లా మోకిలలో కొంత భూమిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం ఆలోచించి నర్సాపూర్ టికెట్ విషయంలో పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, జిల్లా జనరల్ సెక్రటరీ భరత్‌గౌడ్ పాల్గొన్నారు.


వెల్దుర్తిలో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

## భారీ మెజార్టీతో సునీతారెడ్డి విజయం తథ్యం

- బీఆర్‌ఎస్ వెల్దుర్తి మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ధీమా

వెల్దుర్తి, నవంబర్ 3: నర్సాపూర్ నియోజకరవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయం తథ్యమని బీఆర్‌ఎస్ వెల్దుర్తి మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి, గ్రామ ప్రచార కమిటీలు, ప్రచారం చేయాల్సిన ప్రణాళికలను చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకుల సమన్వయంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయానికి సైనికుల్లా కృషిచేస్తామన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయానికి బాటలు వేస్తాయని, నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీతో సునీతాలక్ష్మారెడ్డి గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార రథాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆంజనేయులు, రాజిరెడ్డి, నాయకులు కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, అశోక్‌గౌడ్, గంగాధర్, రమేశ్‌చందర్, శ్రీను, శ్రవణ్‌లతో పాటు మండలంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు శివ్వంపేటలో బీఆర్‌ఎస్ ప్రచారం

శివ్వంపేట, నవంబర్3: శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని శుక్రవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు సికింద్లాపూర్ గ్రామం నుంచి మొదలుకొని బిజిలీపూర్, గంగాయపల్లి, హరిదాస్‌తండా, చండి, బొజ్యతండా, రెడ్యతండా, వెంక్యతండా, రూప్‌సింగ్‌తండాల్లో శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డిల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు లావణ్యమాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, సీనియర్ నాయకులుహనుమంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆంజనేయులు, కొత్తపేట యాదాగౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు రవినాయక్‌లతో పాటు పలువురు హాజరుకానున్నారని తెలిపారు.

# సమిష్టి కృషితో మండల అభివృద్ధి సాధ్యం

- 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు: ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు


నిజాంపేట మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సిద్ధిరాములు

నిజాంపేట, నవంబర్3: అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితోనే నూతనంగా ఏర్పడిన నిజాంపేట మండలం అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ సిద్ధిరాములు అన్నారు. శుక్రవారం నిజాంపేటలోని మండ ల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సిద్ధిరాములు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు గ్రామ సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. అనంతరం మండల ఏవో సతీశ్ మాట్లాడుతూ మండల పరిధిలో 15 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంను విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అందె ఇందిరా కొండల్‌రెడ్డి, ఎంపీడీవో జగదీశ్వర్, మండల సర్పంచులు అమరసేనారెడ్డి, అరుణ్‌కుమార్, అనిల్‌కుమార్, చంద్రవర్ధిని, ఎంపీటీసీలు భాగ్యలక్ష్మి, లహరి, లలిత, సురేశ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు గౌస్, మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, పీఆర్ ఏఈ శరత్, వెంటర్నరీ డా. సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్లు కొండల్‌రెడ్డి, బాపురెడ్డి, హార్టికల్చర్ అధికారి సంతోశ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.


రామాయంపేటలో మాట్లాడుతున్న ఎమార్పీఎస్ టీఎస్ నాయకులు

## రేపు 'హలో మాదిగ చలో హైదరాబాద్'

రామాయంపేట, నవంబర్ 3: 'హలో మాదిగ చలో హైదరాబాద్' నినాదంతో 5వ తేదీన (ఆదివారం) హైదరాబాద్‌లో జరిగే ఎమార్పీఎస్ యుద్ధభేరి మహాసభకు విజయవంతం చేయాలని ఎమార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనువాస్‌లు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి దళిత బిడ్డకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈనెల 5వ తేదీన జరిగే యుద్ధభేరి మహాసభకు మెదక్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున దళిత బిడ్డలు కదలాలని కోరారు. దళితుల సమస్యల సాధన కోసమే 'హలో మాదిగ చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు వెల్లడించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మద్దూరి రాజేందర్, శరత్, రాకేశ్, అరుణ్ పాల్గొన్నారు.